సాక్షి విశాఖపట్నం

శుక్రవారం । 31 । మే । 2024



పొగ.. పగ 8లో



బీచ్‌రోడ్డులో కారు బీభత్సం 8లో



సందడిగా సాగరతీరం 8లో

న్యూస్‌రీల్

ఈఎన్‌సీలో వెస్టర్న్ నేవల్ చీఫ్



డాక్‌యార్డ్‌లో ప్రాజెక్ట్‌ల గురించి వివరిస్తున్న నేవీ సిబ్బంది

సింధియా: విశాఖపట్నంలోని తూర్పు నౌకాదళ కమాండ్‌ను వెస్టర్న్ నేవల్ కమాండర్ ఫ్లాగ్ ఆఫీసర్, కమాండింగ్ ఇన్ చీఫ్ వైస్ అడ్మిరల్ సంజయ్ జె సింగ్, అతని సతీమణి జరీన్ సింగ్ గురువారం సందర్శించారు. పర్యటనలో భాగంగా తూర్పు నౌకాదళ ఫ్లాగ్ ఆఫీసర్, కమాండింగ్ ఇన్ చీఫ్ వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్‌తో వారు సమావేశమయ్యారు. కమాండ్‌లో పురోగతిలో ఉన్న వివిధ కార్యకలాపాలు, ప్రాజెక్ట్‌ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం నేవల్ డాక్‌యార్డ్, మెటీరియల్ ఆర్గనైజేషన్, ఐఎన్ఎస్ ఎక్సిలా, ఐఎన్ఎస్ విశ్వకర్మ వద్ద ఉన్న సబ్‌మెరైన్ డ్యామేజ్ కంట్రోల్ తదితర ప్రాంతాలను సందర్శించారు.

గురుకులాల్లో ఇంటర్ మిగులు సీట్ల భర్తీ



స్పాట్ అడ్మిషన్ పొందిన విద్యార్థికి ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న సమన్వయకర్త రూపావతి

సబ్బవరం: డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల కళాశాలల్లో 2024–25 విద్యా సంవత్సరానికి ఇంటర్ ప్రథమ సంవత్సరంలో మిగులు సీట్ల భర్తీకి సబ్బవరం గురుకులంలో గురువారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఉమ్మడి విశాఖ జిల్లా పరిధిలోని సబ్బవరం, దేవరాపల్లి, గొలుగొండ, శ్రీకృష్ణాపురం బాలుర గురుకుల పాఠశాలల్లో ఖాళీగా ఉన్న సీట్లకు కౌన్సెలింగ్ నిర్వహించినట్లు జిల్లా గురుకులాల సమన్వయకర్త, కౌన్సెలింగ్ చైర్మన్ రూపావతి తెలిపారు. బాలుర గురుకులాల్లో 108 సీట్లు ఖాళీగా ఉండగా.. కౌన్సెలింగ్‌కు 150 మంది హాజరయ్యారన్నారు. మెరిట్, రూల్ ఆఫ్ రిజర్వేషన్‌కు అనుగుణంగా 74 మంది విద్యార్థులకు ప్రవేశం కల్పించామన్నారు. గురుకులాల ప్రిన్సిపాళ్లు ఆర్.రామకృష్ణ, సీహెచ్ రవీంద్రనాథ్, వి.రత్నవల్లి తదితరులు పాల్గొన్నారు.

పోర్టు పరిసరాల్లో 10 లక్షల మొక్కలు నాటడమే లక్ష్యం



మొక్క నాటుతున్న పోర్టు కార్యదర్శి వేణుగోపాల్, ఇతర అధికారులు

విశాఖ సిటీ: విశాఖ పోర్ట్ అథారిటీలో ప్రపంచ పర్యావరణ వారోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. పోర్టు చైర్మన్ డాక్టర్ ఎ.అంగముత్తు ఈ వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా పోర్టు కార్యదర్శి వేణుగోపాల్ ఆధ్వర్యంలో అధికారులు సీ హార్స్ జంక్షన్ నుంచి హెచ్ 7 కూడలి మధ్య మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో పోర్టు సాధారణ పరిపాలన, ఆర్థిక విభాగం అధికారులు, ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. రానున్న రోజుల్లో పోర్టు పరిసర ప్రాంతాల్లో 10 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్దేశించారు. ఈ సందర్భంగా వారం రోజుల పాటు పలు కార్యక్రమాలకు రూపకల్పన చేశారు. ఉద్యోగులకు, వారి కుటుంబ సభ్యులకు వ్యాసరచన, వక్తృత్వ, పెయింటింగ్ పోటీలను నిర్వహించనున్నారు.

పాలిసెట్ కౌన్సెలింగ్‌లో స్వల్ప మార్పులు

మురళీనగర్: పాలిసెట్ కౌన్సెలింగ్‌లో స్వల్ప మార్పులు చేశారు. ఈ మేరకు రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ సి.నాగరాణి ఉత్తర్వులు జారీ చేసినట్లు పాలిసెట్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ కె.నారాయణరావు, గైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ ఓ ప్రకటనలో తెలిపారు. జూన్ 4న ఎన్నిక ఫలితాలకు సంబంధించి కౌంటింగ్ నిర్వహిస్తున్న కారణంగా.. 3వ తేదీ నుంచి మూడు రోజుల పాటు 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. దీంతో 3వ తేదీ నుంచి కౌన్సెలింగ్‌కు వచ్చేందుకు విద్యార్థులు ఇబ్బందులు పడే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో జూన్ 3న నిర్వహించాల్సిన ధ్రువీకరణపత్రాల పరిశీలన 6వ తేదీకి మార్చినట్లు వివరించారు. ఈ నెల 31 నుంచి ప్రారంభం కావాల్సిన వెబ్ ఆప్షన్ల నమోదును జూన్ 7 నుంచి 10 తేదీ వరకు నిర్వహిస్తామన్నారు. విద్యార్థులు ఈ విషయాన్ని గమనించి ఆయా తేదీల్లో కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని వారు సూచించారు.

పక్కాగా ఉంటేనే ఫ్రీహోల్డ్



- విశాఖలో 2 వేల ఎకరాల అసైన్డ్ భూములు ఉన్నట్లు అంచనా
- సుమారు 700 ఎకరాల అసైన్డ్ భూములకే పూర్తి హక్కులు
- జీవోలో మార్గదర్శకాలు అనుసరించి దరఖాస్తుల పరిశీలన
- గ్రామీణ ప్రాంతాల్లో భూములకే ఫ్రీహోల్డ్ ప్రొసీడింగ్స్
- అన్ని పత్రాలు ఉన్న దరఖాస్తులన్నీ క్లియర్
- రాష్ట్రంలో అత్యల్పంగా ప్రొసీడింగ్స్ ఇచ్చింది అంబేడ్కర్ కోనసీమ తరువాత విశాఖలోనే..

సాక్షి, విశాఖపట్నం: వక్రభాష్యాలకు అలవాటుపడిన పచ్చ మీడియా తీరుమారడం లేదు. ఇప్పటికీ ప్రభుత్వం, అధికారులపై బురద జల్లే ప్రయత్నాలు చేస్తూనే ఉంది. ప్రభుత్వం చేసే ప్రతి నిర్ణయంపైనా, వాటిని అమలు చేస్తున్న అధికారులపైనా విషం కక్కుతోంది. మొన్నటి వరకు ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌పై గగ్గోలు పెట్టిన పచ్చ మీడియా.. తాజాగా దళితుల భూములకు సంపూర్ణ హక్కులు కల్పించే అంశంపై రాష్ట్ర స్థాయి నుంచి జిల్లా స్థాయి ఉన్నతాధికారుల వరకు ప్రతి ఒక్కరిపై తప్పుడు కథనాలు వండి వారుస్తోంది. దశాబ్దాల తరబడి సాగు, ఇతర పనులు చేసుకుంటున్న అసైన్డ్ భూములను నిషిద్ధ జాబితా నుంచి తొలగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందుకు 596 జీవోను విడుదల చేసింది. గత ఎనిమిది నెలలుగా జిల్లాలో దరఖాస్తులు చేసుకున్న వారిలో అన్ని డాక్యుమెంట్లు సక్రమంగా ఉన్న 700 ఎకరాలకు కలెక్టర్ ఫ్రీ హోల్డ్ ప్రొసీడింగ్స్ ఇచ్చారు. వాస్తవానికి రాష్ట్రంలో అత్యల్పంగా అనుమతులు ఇచ్చిన జిల్లాలో విశాఖ రెండో స్థానంలో ఉంది. అయినప్పటికీ నిజమైన దళితుల అసైన్డ్ భూములకు సంపూర్ణ హక్కులు కల్పిస్తున్న అధికారులపై పచ్చమీడియా బురద జల్లే ప్రయత్నం చేస్తోంది.

జిల్లాలో 2 వేల అసైన్డ్ భూములు

జిల్లాలో 2 వేల ఎకరాల వరకు అసైన్డ్ భూములు ఉన్నట్లు రెవెన్యూ అధికారులు అంచనా వేస్తున్నారు. వాస్తవానికి పెద్ద మొత్తంలోనే అసైన్డ్ భూములు ఉన్నప్పటికీ.. ప్రభుత్వ అవసరాలకు, ఒక సెంట్ లేఅవుట్ల అభివృద్ధి కోసం ల్యాండ్ పూలింగ్ ద్వారా ఈ అసైన్డ్ భూములను సేకరించారు. దీంతో ప్రస్తుతం తక్కువ మొత్తంలోనే ఈ అసైన్డ్ భూములు ఉన్నాయి.

అర్బన్‌లో అసైన్డ్ భూమికి అనుమతులు ఇవ్వలేదు

జిల్లాలో గ్రామీణ ప్రాంతంలోనే కాకుండా అర్బన్‌లో కూడా అసైన్డ్ భూములు ఉన్నాయి. ప్రభుత్వ జీవోలో కూడా అర్బన్, రూరల్ అనే ప్రస్తావన లేకుండా అన్నింటికి సంపూర్ణ హక్కులు కల్పించాలని ఉంది. అయినప్పటికీ అర్బన్‌లో కొన్ని భూములకు సంబంధించి వివాదాలు, భవిష్యత్తు అవసరాలు.. ఇలా పలు అంశాలను పరిగణనలోకి తీసుకొని అర్బన్‌లో భూములను నిషిద్ధ జాబితా నుంచి తొలగించకూడదని భావించారు. రూరల్‌లో ఉన్న అసైన్డ్ భూములకు ముందుగా ఫ్రీహోల్డ్ ప్రొసీడింగ్స్ ఇవ్వాలని నిర్ణయించారు. దీంతో పెందుర్తి, భీమిలి, ఆనందపురం గ్రామీణ ప్రాంతాల్లోను, పద్మనాభంలో ఉన్న అసైన్డ్ భూములకు సంబంధించిన దరఖాస్తులను తొలుతగా క్లియర్ చేస్తున్నారు. అర్బన్‌కు సంబంధించి ఒక్క ఎకరం అసైన్డ్ భూమికి కూడా అనుమతులు ఇవ్వలేదు.

700 ఎకరాలకు అనుమతులు

జిల్లాలో సుమారు 2 వేల అసైన్డ్ భూములు ఉన్నప్పటికీ కొంత మంది మాత్రమే 596 జీవో ప్రకారం దరఖాస్తు చేసుకున్నారు. ఈ దరఖాస్తులను కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అధ్యక్షతన ఏర్పాటైన కమిటీ పరిశీలిస్తోంది. జీవోలో మార్గదర్శకాలు అనుసరించి తహసీల్దార్ కార్యాలయం నుంచి జాయింట్ కలెక్టర్ వరకు అన్ని స్థాయిల్లోనూ డాక్యుమెంట్లు పక్కాగా తనిఖీ చేసి అన్ని సక్రమంగా ఉంటేనే ఫ్రీహోల్డ్ ప్రొసీడింగ్స్ ఇస్తున్నారు. ఇలా గత 8 నెలల్లో సుమారు 700 ఎకరాల వరకు అనుమతులు మంజూరు చేశారు. రాష్ట్రం మొత్తం మీద సుమారు 9.1 లక్షల ఎకరాల వరకు అసైన్డ్ భూములు ఉన్నట్లు రెవెన్యూ రికార్డు ప్రకారం తెలుస్తోంది. ఇందులో అత్యధికంగా చిత్తూరులో 1.64 లక్షల ఎకరాలు, సత్యసాయి జిల్లాలో 1.38 లక్షల ఎకరాలు, ప్రకాశం జిల్లాలో 1.05 లక్షల ఎకరాలు, అన్నమయ్య జిల్లాలో 97 వేల ఎకరాల అసైన్డ్ భూములకు ఆయా జిల్లా కలెక్టర్లు నిషిద్ధ జాబితా నుంచి తొలగించి దళితులకు ఆ భూములపై సంపూర్ణ హక్కులు కల్పించారు. అలాగే ఉత్తరాంధ్ర జిల్లాలైన శ్రీకాకుళంలో 12,230 ఎకరాలు, విజయనగరంలో 6100 ఎకరాలకు ఫ్రీహోల్డ్ ప్రొసీడింగ్స్ ఇచ్చారు. రాష్ట్రంలో అత్యల్పంగా అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 506 ఎకరాలకు ఇవ్వగా.. ఆ తరువాత స్థానంలో తక్కువగా కేవలం 700 ఎకరాలకు మాత్రమే విశాఖ కలెక్టర్ ప్రొసీడింగ్స్ ఇచ్చారు.

సక్రమంగా డాక్యుమెంట్లు లేకపోవడంతో..

ఇదిలా ఉంటే కొన్ని దరఖాస్తుల్లో లోటుపాట్లు ఉండడంతో వాటిని తహసీల్దార్ కార్యాలయాల్లోనే సిబ్బంది పరిశీలన నిమిత్తం పక్కనపెట్టారు. కొన్నింటికి రికార్డులు సక్రమంగా లేకపోవడం, పీఓటీ ఉల్లంఘనలు, సరమైన భూ పత్రాలు లేకపోవడంతో వాటిని రెవెన్యూ అధికారులు తిరస్కరించారు. అన్ని డాక్యుమెంట్లు ఉన్న ప్రతి దరఖాస్తును అధికారులు క్లియర్ చేశారు.

దళితులకు సంపూర్ణ భూ హక్కులు

దళితులు తమ పట్టా భూములు డీ నోట్‌పై చేయాలని చాలా ఏళ్లుగా రెవెన్యూ అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. అయితే వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలో ఇటువంటి విజ్ఞప్తులు ఎక్కువగా రావడంతో అసైన్డ్ భూములు ఉన్న వారికి సంపూర్ణ హక్కుల కల్పించాలని నిర్ణయించింది. దాని ప్రకారం ప్రభుత్వం నిర్దిష్టమైన మార్గదర్శకాలతో 596 జీవోను 2023లో విడుదల చేసింది. దీని ప్రకారం అసైన్డ్ భూములను నిషిద్ధ జాబితా 22ఏ నుంచి తొలగించి అసైన్డ్ హోల్డర్లకు పూర్తి హక్కులు కల్పించనుంది. ఈ జీవో ఆధారంగా అసైన్డ్ భూములు కలిగిన దళితులు దరఖాస్తులు చేసుకున్నారు.

అన్నీ సక్రమంగా ఉంటే అనుమతులు



ప్రభుత్వ జీవో ఆధారంగా అసైన్డ్ భూములకు సంబంధించి అన్ని పత్రాలు సక్రమంగా ఉంటే ఫ్రీ హోల్డ్ ప్రొసీడింగ్స్ ఇస్తున్నాం. గత ఎనిమిది నెలలుగా జరుగుతున్న ప్రక్రియ ఇది. ఇప్పటివరకు గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న 700 ఎకరాలకు మాత్రమే అనుమతులు ఇచ్చాం. అర్బన్ ఉన్న ఒక్క ఎకరానికి కూడా పర్మిషన్ ఇవ్వలేదు. కొన్నింటికి డాక్యుమెంట్లు లేకపోవడం, పీఓటీ ఉల్లంఘనలు కారణంగానే తహసీల్దార్ కార్యాలయాల్లో దరఖాస్తులను పక్కనపెట్టారు. అన్ని సక్రమంగా ఉన్న ఒక్క దరఖాస్తు కూడా పెండింగ్‌లో లేదు.

– డాక్టర్ ఎ.మల్లికార్జున, కలెక్టర్

ఈసెట్‌లో విశాఖ విద్యార్థుల సత్తా

మొదటి పది ర్యాంకులు సాధించిన గైస్ విద్యార్థులు



రమేష్ (మెటలర్జీ)



కిశోర్ చంద్ (మెకానికల్)



రెండో ర్యాంకర్ మనోహర్‌కు స్వీట్ తినిపిస్తున్న తండ్రి గురునాథరావు, తల్లి పాపాజీ

మురళీనగర్/పెదగంట్యాడ: పాలిటెక్నిక్ విద్యార్థులు నేరుగా బీటెక్ సెకండియర్‌లో ప్రవేశానికి నిర్వహించిన ఈసెట్ ఫలితాల్లో విశాఖకు చెందిన విద్యార్థులు సత్తా చాటి రాష్ట్ర స్థాయిలో ఫస్ట్ ర్యాంక్‌లు సాధించారు. కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ మెటలర్జికల్ ఇంజినీరింగ్ విద్యార్థి ముద్రు రమేష్ ఈసెట్‌లో 116 మార్కులు, మెకానికల్ ఇంజినీరింగ్‌లో ఇదే కాలేజీకి చెందిన కిల్లి కిశోర్ చంద్ 169 మార్కులు సాధించి స్టేట్ టాపర్లుగా నిలిచారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.నారాయణరావు, మెకానికల్, మెటలర్జీ విభాగాల హెడ్‌లు, అధ్యాపకులు వీరిని అభినందనలు తెలిపారు.

గైస్ విద్యార్థుల రికార్డు

ఈసెట్ ఫలితాల్లో మొదటి 10 ర్యాంకులు కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్(గైస్) విద్యార్థులు సాధించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ తెలిపారు. పి.అశోక్(1వ ర్యాంకు), బి.మనోహర్ (2), జి.నితిన్ ధనుంజయ్‌రాయ్ కుమార్ (3), బీవీ ఎస్ అఖిల్ (4), జనపరెడ్డి పవన్ (5), కొయిలాడ బాలాజీ (6), జి.చైతన్య (7), కె.సంతోష్(8), గండి ధనుంజయ్ (9), కె.ప్రియ 10వ ర్యాంకు సాధించారు. ఈ కాలేజీ విద్యార్థులు వరుసగా నాలుగేళ్ల నుంచి రాష్ట్ర స్థాయిలో మొదటి పది ర్యాంకులు సాధించి రికార్డు సృష్టిస్తున్నారు. కెమికల్ విభాగం నుంచి 1, 2, 3, 4, 7, 10 ర్యాంకులు, ప్లాస్టిక్ అండ్ పాలిమర్స్ విభాగం నుంచి 5, 9 ర్యాంకులు, పెట్రో కెమికల్ నుంచి 6వ ర్యాంకు, ఆయిల్ టెక్నాలజీ నుంచి 8వ ర్యాంకు సాధించారు. ప్రిన్సిపాల్‌తో పాటు ఇతర విభాగాల అధ్యాపకులు విద్యార్థులను అభినందించారు.

బడి బస్సుకు సామర్థ్య పరీక్ష

పాసైతేనే రోడ్డుపైకి..

- పాఠశాల యాజమాన్యాలకు స్పష్టం చేసిన రవాణా శాఖ
- అన్నీ సవ్యంగా ఉంటేనే అనుమతులు
- జిల్లాలో 913 బస్సులకు ఎఫ్‌సీ పూర్తి



గోపాలపట్నం: పిల్లల బంగారు భవిష్యత్ బడితోనే కాదు.. బడి బస్సుతోనూ ముడిపడి ఉంది. అందుకే పాఠశాలలు పునఃప్రారంభానికి ముందే రవాణా శాఖ పటిష్ట చర్యలు చేపట్టింది. ఈ మేరకు మాధవధారలోని రవాణా శాఖ కార్యాలయంలో గురువారం ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలతో ప్రత్యేక సమావేశం నిర్వహించింది. వెంటనే స్కూల్ బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు చేయించాలని ఉప రవాణా కమిషనర్ రాజారత్నం వారికి సూచించారు.

పాఠశాలలు, కళాశాలలు మరికొన్ని రోజుల్లో పునఃప్రారంభం కానున్నాయి. పట్టణం, పల్లె తేడా లేకుండా ఇప్పుడు ప్రయివేట్ విద్యా సంస్థలన్నీ విద్యార్థులను తరలించేందుకు బస్సులను ఏర్పాటు చేశాయి. ఇందుకోసం ప్రత్యేకంగా ఫీజు వసూలు చేస్తున్నాయి. ఈ బస్సుల్లో విద్యార్థులను ఇళ్ల నుంచి భద్రంగా తీసుకెళ్లి అంతే జాగ్రత్తగా ఇంటికి చేర్చాలి. ఇందుకోసం ప్రతీ బస్సును పూర్తి కండీషన్‌లో ఉంచాలి. ఏ మాత్రం తేడా వచ్చినా జరిగే నష్టం ఎవరూ ఊహించలేం. కొన్ని యాజమాన్యాలు బస్సులకు రంగులు వేసి రోడ్డెక్కిస్తున్నాయి. కనీస ప్రమాణాలూ పాటించడం లేదు. అందుకే ఏటా బడులు పునఃప్రారంభంలోనే ట్రాన్స్‌పోర్టు అధికారి, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు ప్రత్యేకంగా తనిఖీలు నిర్వహించిన తర్వాత.. ఫిట్‌నెస్ సర్టిఫికెట్ (ఎఫ్‌సీ) జారీ చేస్తారు. ఏ చిన్న లోపం ఉన్నా.. వెనక్కి పంపుతారు. ఈ నేపథ్యంలో ఈ నెల 12లోగా స్కూల్ బస్సుల ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు కలిగి ఉండాలని రవాణా శాఖాధికారులు స్కూళ్ల యాజమాన్యాలకు స్పష్టం చేశారు.

913 బస్సులకు ఎఫ్‌సీ

ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల మంజూరు చేయడంలో విశాఖ రవాణా శాఖ ముందంజలో ఉంది. జిల్లాలో సుమారు 1,300 స్కూల్, కళాశాల బస్సులు ఉండగా.. ఇప్పటివరకు 913 బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు జారీ చేశారు. బస్సులకు తగిన పరీక్షలు జరిపి, నిబంధనల మేరకు ఉన్న వాటికే ఎఫ్‌సీలు జారీ చేసినట్లు అధికారులు తెలిపారు. ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకుంటే.. సూచించిన తేదీన ఫిట్‌నెస్ పరీక్షలు చేస్తున్నారు.



ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న డీటీసీ రాజారత్నం

జూన్ 12 తర్వాత ప్రత్యేక తనిఖీలు

పాఠశాలలు జూన్ 12 నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో పాఠశాల యాజమాన్యాలు ఈ లోగా బస్సుల ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు పొందాలి. జూన్ నెల 12 తర్వాత జిల్లాలో ప్రత్యేక తనిఖీలు చేపడతాం. ఈ తనిఖీల్లో దొరికిన బస్సులపై కఠినంగా వ్యవహరిస్తాం. బస్సులను సీజ్ చేస్తాం. పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలు ఈ పరిస్థితిని తీసుకురావద్దని కోరుతున్నాం. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని కచ్చితంగా నిబంధనలు పాటించాలి.

– రాజారత్నం, ఉప రవాణా కమిషనర్

ఈ నిబంధనలు తప్పనిసరి

- బస్సు డ్రైవర్లు 60 ఏళ్ల లోపు వయసు ఉండి ఐదేళ్ల అనుభవం కలిగి ఉండాలి. బీపీ, షుగర్, కంటి సంబంధిత సమస్యలు లేవని మెడికల్ సర్టిఫికెట్ సమర్పించాలి. ఈ సర్టిఫికెట్ బస్సులో ఒకటి, యజమాని వద్ద ఒకటి ఉంచాలి.
- ప్రతి బస్సుకూ అటెండర్ తప్పనిసరి.స్కూల్ బస్సుల వేగం గంటకు 60 కిలోమీటర్లు మాత్రమే ఉండేలా స్పీడ్ గవర్నర్స్ తప్పనిసరి.
- బ్రేక్, హ్యాండ్ బ్రేక్, స్టీరింగ్, టైర్లు, స్పీడో మీటర్ అన్నీ కండీషన్‌లో ఉండాలి.
- బస్సుకు సంబంధించిన అన్ని లైట్లు పనిచేయాలి. రిఫ్లెక్టివ్ టేపును బస్సుకు నాలుగు వైపులా అతికించాలి.
- బస్సుకు ఉన్న గ్లాసులు అన్ని పటిష్టంగా ఉండేలా చూసుకోవాలి.
- బస్సు నుంచి అధిక మొత్తంలో బ్లాక్ స్మోక్ (పొగ) రాకుండా చూడాలి.
- బస్సుకు అత్యవసర ద్వారం, మంటలను ఆర్పే పరికరం, ఫస్ట్ ఎయిడ్ బాక్స్ ఉండాలి.
- సైడ్ విండోలకు మధ్యలో మూడు అంగుళాలకు మించని దూరంలో అడ్డంగా మూడు లోహపు కడ్డీలు అమర్చి ఉండాలి.
- ఫుట్ బోర్డుపై మొదటి మెట్టు భూమి నుంచి 325 మి.మీ ఎత్తుకు మించరాదు. మెట్లు జారకుండా లోహంతో అమర్చబడి ఉండాలి.
- బస్సు ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు పట్టుకునేందుకు వీలుగా బస్సు ముందరి తలుపు మెట్లకు సమాంతరంగా రైలింగ్‌లు ఏర్పాటు చేయాలి
- బస్సు ఎడమవైపు ముందు భాగంలో యాజమాన్యం వివరాలు, స్కూల్ బాయ్ అండ్ గర్ల్ ఇమేజ్ పొందుపర్చాలి
- బస్సు బయలు దేరే సమయం, ఆగే స్థలాలు రూట్ ప్లాన్, విద్యార్థుల సంఖ్య, వారి పూర్తి వివరాలు, డ్రైవర్ వివరాలు బస్సులో ఉంచాలి.

బ్యాంకు ఖాతాల్లోనే పింఛన్ నగదు

- వృద్ధులు, వికలాంగులకు ఇంటి వద్దనే పంపిణీ : కలెక్టర్ మల్లికార్జున

విశాఖ విద్య: సామాజిక పింఛన్లు జూన్ 1వ తేదీ నుంచి 5 వరకు పంపిణీ చేయనున్నట్లు కలెక్టర్ మల్లికార్జున తెలిపారు. పింఛన్ల పంపిణీకి చేస్తున్న ఏర్పాట్లపై ఆయన అధికారులకు దిశానిర్దేశం చేశారు. జిల్లాలో 1,64,452 మంది లబ్ధిదారులకు రూ.49,62,38,500లు పంపిణీ చేయాల్సి ఉందన్నారు. వీరిలో 1,17,487 మందికి సంబంధించిన రూ.35,24,67,000లు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి జూన్ 1న జమ చేయడం జరుగుతుందన్నారు. మిగిలిన 46,965 మంది పింఛనుదారులకు రూ.14,37,71,500లను వారి ఇళ్ల వద్దనే పంపిణీ చేసేలా తగిన ఏర్పాట్లు చేశామన్నారు. వికలాంగులు, తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నవారు, మంచానికే పరిమితమైన వారు, మేలో బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ కాని వారికి, జూన్ 1 నాటికి 80 ఏళ్ల పైబడిన వారికి ఇళ్ల వద్దనే పింఛను డబ్బులు అందజేస్తామన్నారు.

ఆర్వోలదే తుది నిర్ణయం

- ఓట్ల లెక్కింపు ప్రక్రియపై ఈసీ మార్గదర్శకాలు
- ఏజెంట్ల సమక్షంలో తెరవనున్న స్ట్రాంగ్ రూమ్‌లు
- ఎన్‌కోర్ యాప్‌లో నమోదు తరువాతే ఫలితాల వెల్లడి

విశాఖసిటీ : సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసిన ఎంపీ, ఎమ్మెల్యేల అభ్యర్థుల భవితవ్యం ఈవీఎంలలో నిక్షిప్తమైంది. ఎన్నికల కమిషన్ నిబంధనలకు అనుగుణంగానే ఓట్ల లెక్కింపు ఫలితాలు ప్రకటించనున్నారు. కౌంటింగ్ అంశంపై ఈసీ పలు మార్గదర్శకాలను జారీ చేసింది. ఈ ఫలితాల ప్రకటనలో అధికారులు ఎవరూ సొంత నిర్ణయాలు తీసుకోకూడదని స్పష్టం చేసింది. రిటర్నింగ్ అధికారి నిర్ణయమే తుది నిర్ణయంగా భావించాలని ఎన్నికల కమిషన్ స్పష్టం చేసింది.

3 నాటికి ఏర్పాట్లు పూర్తి : జూన్ 4వ తేదీన 6 గంటలకు కౌంటింగ్ కేంద్రాలకు చేరుకోగానే కౌంటింగ్ ఏజెంట్ల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్‌లు తెరవాల్సి ఉంటుంది. ఓట్ల లెక్కింపులో ఏవైనా సందేహాలు వచ్చినప్పుడు ఆర్వోలతో మాట్లాడి సందేహాలు నివృత్తి చేసుకోవాలి. ముఖ్యంగా పోస్టల్ బ్యాలెట్లు, హోం ఓటింగ్, సర్వీస్ ఓటర్లు (ఈటీపీబీఎస్) ఓట్లు ఏవిధంగా లెక్కించాలి, వ్యాలిడ్, ఇన్ వ్యాలిడ్ ఓట్లను ఏ విధంగా గుర్తించాలి అనే దానిపై జిల్లాలో రెండో విడత శిక్షణ ఇవ్వనున్నారు. కౌంటింగ్ ఏర్పాట్లన్నీ జూన్ 3వ తేదీకి పూర్తి చేసుకోవాలి. ఒక్కో నియోజకవర్గానికి 14 టేబుళ్ల చొప్పున ఏర్పాటు చేయగా.. అక్కడే కేంద్ర పరిశీలకులతో పాటు కౌంటింగ్ సిబ్బంది ఉంటారు. రాజకీయ పార్టీల అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లకు ప్రత్యేక కుర్చీలు ఏర్పాటు చేస్తారు. ఏజెంట్లు తమకు కేటాయించిన టేబుళ్ల వద్దే ఉండాలి. పక్క టేబుల్ వద్దకు వెళ్లడానికి వీలులేదు. 18 టేబుళ్లకు 18 మంది ఏజెంట్లు ఉంటారు. ఒక్కసారి కౌంటింగ్ కేంద్రంలోకి వచ్చిన ఏజెంట్లు బయటకు వెళ్తే తిరిగి లోపలకు రావడానికి వీలుండదు. ఈవీఎంలను కౌంటింగ్ కేంద్రాల్లోకి తీసుకురావడానికి సిబ్బందిని కేటాయిస్తారు.

సిబ్బందికి ప్రత్యేక డ్రెస్ కోడ్

పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా సిబ్బందికి ప్రత్యేక డ్రెస్ కోడ్ నిర్ణయిస్తారు. ఆ డ్రెస్ కోడ్‌ని అనుసరించే ఆయా రూమ్‌లకు సిబ్బంది లోపలికి వెళ్లడానికి అనుమతి ఇస్తారు. ఒక రౌండు పూర్తయ్యాకే మరో రౌండుకు సంబంధించి కంట్రోల్ యూనిట్లు తీసుకు రావాల్సి ఉంటుంది. కౌంటింగ్ కేంద్రాల్లోకి వెళ్లే వారికి ఐడీ కార్డులు తప్ప ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు, సెల్‌ఫోన్‌లు ఉండకూడదు. సిబ్బంది లేదా కౌంటింగ్ ఏజెంట్లు ఎలక్ట్రానిక్ పరికరాలు, సెల్ ఫోన్‌లు తీసుకొస్తే.. వారిని లోపలికి పంపించరు. వాటిని వేరే చోట భద్రపరిచిన తర్వాతే లోపలికి పంపిస్తారు.



కౌంటింగ్ కోసం ఏర్పాటు చేసిన టేబుల్స్

ఎన్‌కోర్ యాప్‌లో నమోదు తర్వాతే..

ఓట్ల లెక్కింపులో భాగంగా స్ట్రాంగ్ రూంలను కౌంటింగ్ ఏజెంట్ల సమక్షంలోనే తెరుస్తారు. ఈవీఎంలను నమోదు చేసుకునేందుకు స్ట్రాంగ్ రూమ్‌లో ఒక నోడల్ ఆఫీసర్ ఉంటారు. ఈవీఎంలను కౌంటింగ్ గదిలోకి తీసుకురాగానే వాటికి సీల్ సరిగా ఉందా లేదా అని పరిశీలిస్తారు. ఈవీఎంలలో బ్యాటరీలు పని చేయకపోతే మార్చి అన్ చేస్తారు. ఓట్ల లెక్కింపు పూర్తి కాగానే వివరాలను ఎన్‌కోర్ యాప్‌లో నమోదు చేసిన అనంతరం ఫలితాలను ఆయా నియోజకవర్గాల ఆర్‌ఓలు వెల్లడిస్తారు. పోస్టల్ బ్యాలెట్, సర్వీస్ ఓట్ల లెక్కింపుకు ఒక ఏఆర్‌వో, కంప్యూటర్ అసిస్టెంట్, కంప్యూటర్ సూపర్‌వైజర్, మైక్రో అబ్జర్వర్ ఉంటారు. కేంద్ర పరిశీలకులు కౌంటింగ్ ప్రక్రియ, ఫలితాల వెల్లడి, డిక్లరేషన్ వరకు దగ్గరుండి పరిశీలిస్తారు. కౌంటింగ్ పూర్తి కాగానే ఫలితాలను ప్రకటించి గెలుపొందిన అభ్యర్థికి ఫారం-21 అందజేస్తారు.

ఎస్కార్ట్స్ సాయంతో పోస్టల్ బ్యాలెట్ల తరలింపు

- కౌంటింగ్ సమాచారం ప్రదర్శనకు మానిటర్స్ ఏర్పాటు
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మల్లికార్జున
- స్ట్రాంగ్ రూమ్స్, కౌంటింగ్ కేంద్రాల పరిశీలన

విశాఖసిటీ: విశాఖ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో పోలైన పోస్టల్ బ్యాలెట్లను జూన్ 2న పటిష్ట భద్రత నడుమ ఎస్కార్ట్‌ల సాయంతో మెయిన్ స్ట్రాంగ్ రూమ్‌కు తరలించాలని రెవెన్యూ, పోలీసు విభాగాల అధికారులను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మల్లికార్జున ఆదేశించారు. కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ బిల్డింగ్‌లో భద్రపరిచిన బ్యాలెట్లను ట్రిపుల్ ఈ బ్లాక్ పరిధిలో ఏర్పాటు చేసిన పార్లమెంట్ కౌంటింగ్ కేంద్రం సమీపంలోని మెయిన్ స్ట్రాంగ్ రూమ్‌కు తరలించాల్సి ఉంటుందని, ఆ మేరకు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ఏయూ ఇంజినీరింగ్ కళాశాల పరిధిలో ఏర్పాటు చేసిన ఈవీఎం, పోస్టల్ బ్యాలెట్ స్ట్రాంగ్ రూమ్‌లను జాయింట్ పోలీసు కమిషనర్ ఫకీరప్పతో కలిసి గురువారం కలెక్టర్ తనిఖీ చేశారు. అక్కడ భద్రతా పరిస్థితులను పరిశీలించిన కలెక్టర్ స్ట్రాంగ్ రూమ్‌లకు వేసిన సీళ్లను, అమర్చిన సీసీ టీవీలను గమనించారు. అనంతరం ఏయూ పరిధిలో కౌంటింగ్ కేంద్రాల్లో జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. లెక్కింపు ప్రక్రియకు అనుగుణంగా వేసిన టేబుళ్లను, కుర్చీలను, కేంద్రం చుట్టూరా వేసిన కంచెలను పరిశీలించారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

మీడియా సెంటర్‌లో ఏర్పాట్ల పరిశీలన

ఏయూ ఇంజినీరింగ్ కళాశాల పరిధిలోని నానో టెక్నాలజీ బిల్డింగ్‌లో ఏర్పాటు చేసిన మీడియా ఫెసిలిటేషన్ కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. అక్కడ జరుగుతున్న ఏర్పాట్లను గమనించిన ఆయన ఎవరికీ ఎలాంటి అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని డీపీఆర్వో ఎస్వీ రమణకు సూచించారు. ఆర్వోల నుంచి వచ్చే సమాచారాన్ని డిస్‌ప్లే చేసేలా టీవీలను, మానిటర్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అదేవిధంగా మీడియా ప్రతినిధులను ఆయా కౌంటింగ్ కేంద్రాలకు బ్యాచ్‌ల వారీగా పోలీసుల సాయంతో తీసుకెళ్లాలని చెప్పారు. ఈ పర్యటనలో జీవీఎంసీ ఏడీసీ కేఎస్ విశ్వనాథన్, ఆయా నియోజకవర్గాల ఆర్వోలు, పోలీసు అధికారులున్నారు.

హిందీ పరీక్షల ఫీజు చెల్లింపునకు జూన్ 15 వరకు గడువు

తగరపువలస: దక్షిణ భారతదేశ హిందీ ప్రచార సభ-చెన్నై ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హిందీ పరీక్షలకు సంబంధించి ఎలాంటి అపరాధ రుసుం లేకుండా జూన్ 15 వరకు ఫీజు చెల్లించవచ్చని భీమిలి ఆదర్శ ప్రేమీ మండలి అధ్యక్షుడు కె.ఎ స్.ఆర్.కృష్ణారావు తెలిపారు. రూ.10 అపరాధ రుసుంతో జూన్ 25 వరకు చెల్లించవచ్చన్నారు. హిందీ పరిచయ్, ప్రాథమిక, మాధ్యమిక, రాష్ట్రభాష, ప్రవేశిక, రాష్ట్రభాష విశారద పూర్వార్థ, రాష్ట్రభాష విశారద ఉత్తరార్థ, రాష్ట్రభాష ప్రవీణ పూర్వార్థ, రాష్ట్రభాష ప్రవీణ ఉత్తరార్థ పరీక్షలకు హాజరయ్యే వారు ఉచిత శిక్షణ తరగతులకు 89856 47419, 89858 97419 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

నేడు యూనియన్ బ్యాంకు రిటైల్ ఎక్స్‌పో

విశాఖ విద్య: యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో శుక్రవారం రిటైల్ ఎక్స్ పో నిర్వహిస్తున్నట్లు బ్యాంకు ఏజీఎం రంగయ్య నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని రామా టాకీస్ సమీపంలో గల అంబేడ్కర్ భవన్‌లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకు ఉంటుందన్నారు. నిర్మాణ రంగంలో ఉన్న ప్రముఖ బిల్డర్స్, వాహన డీలర్లు, వాణిజ్య సంస్థలు పాల్గొంటాయన్నారు. బ్యాంకు నిబంధనలకు లోబడి తక్షణ రుణసదుపాయాన్ని కల్పిస్తున్నామన్నారు.

పొగ.. పగ

నేడు ధూమపాన వ్యతిరేక దినం
స్మోకింగ్‌తో కోరివారి అనారోగ్యానికి కారణం కావొద్దు
సాధనతో దురలవాట్లకు దూరం కావొచ్చు



డాబాగార్డెన్స్: పొగ.. పగ సాధిస్తోంది. వరదా.. నరదా సిగరెట్టు.. అనారోగ్యానికి తొలిమెట్టులా మారిపోయింది. ఎంత ఒత్తిడి నుంచైనా సిగరెట్, బీడీ, చుట్టలు ఉపశమనం కలిగిస్తాయని, అవి లేనిదే జీవితం లేదని గొప్పలు చెప్పే పొగరాయుళ్ల.. వైద్యులు చెప్పే విషయాలు చదివితే గుండె జారడం ఖాయం.

ధూమపానం వల్ల గుండెతో పాటు జేబుకూ చిల్లు తప్పదు. ఆ విషయం తెలుసుకునేలోపే సిగరెట్ పొగలాగే మన ప్రాణాలు కూడా గాల్లో కలిసిపోతాయనేది నిపుణుల మాట. సిగరెట్, గుట్కా, పాన్ మసాలా పేరు ఏదైనా.. పొగాకును ఏ రూపంలో సేవించినా ప్రమాదమే అంటున్నారు వైద్యులు. ఒక సిగరెట్‌లో నాలుగు వందలకు పైగా హానికర విష రసాయనాలుంటాయి. అందులో 48 కంటే ఎక్కువ క్యాన్సర్ కారకాలని పరిశోధనలు చెబుతున్నాయి. ఈ కారకాలు ఊపిరితిత్తులు, గొంతు, నాలుక వంటి భాగాలకు క్యాన్సర్‌ను సులువుగా కలగజేస్తాయి. గర్భిణులు ధూమపానం చేస్తే గర్భస్థ శిశువు మృదు అవయవాలపై తీవ్ర ప్రభావం చూపుతుందని పరిశోధనలు చెబుతున్నాయి. ధూమపానం చేసే వ్యక్తి తనకు మాత్రమే కాకుండా తన చుట్టూ ఉండేవారి ఊపిరితిత్తుల్లో 25 శాతం విషవాయువును ఉచితంగా పంపుతూ వారి అనారోగ్యానికి కారణమవుతున్నాడు. దేశంలో దీని కారణంగానే ప్రతి రోజూ 2000 మంది చొప్పున.. ఏటా 8 లక్షల మంది మృత్యువాత పడుతున్నట్లు అంచనా. నానాటికీ మహమ్మారిగా మారుతున్న ఈ విషవాయువు అలవాటును తక్షణం మానేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెబుతున్నారు సామాజిక కార్యకర్తలు. దృఢసంకల్పంతో ఈ అలవాటును దూరం చేసుకోవడం పెద్ద విషయమేమీ కాదంటున్నారు వైద్యులు.

అనర్థాలివే..

గుట్కా తిన్నా, సిగరెట్ తాగినా, మద్యం సేవించినా క్యాన్సర్, గుండె, కిడ్నీ జబ్బులు, అల్సర్, దగ్గు, ఆయాసం, ఓపిక లేకపోవడం వంటి రోగాలకు దగ్గరవుతారు. మందానికి పరిమితమవడంతో జీవితం కష్టాల పాలవుతుంది.

ఇలా చేయండి..

- మీకు ధూమపానం అలవాటు ఉంటే మీ వద్ద సిగరెట్, బీడీ, చుట్ట, గుట్కా వంటి వాటిని ఉంచుకోకండి.
- వాటిని తీసుకునే అలవాటు ఉన్న వ్యక్తుల నుంచి కొంత కాలం దూరంగా ఉండండి.
- పొగాకు సేవించడం సంపూర్ణంగా వదిలిన నాడే సంపూర్ణ ఆరోగ్యం పొందగలమనే నిజాన్ని మరువకండి.
- ధూమపానం చేయాలనిపించినప్పుడల్లా లవంగాలు, యాలకులు వంటి వాటిని తీసుకున్నట్లయితే తాత్కాలిక ఉపశమనం కలుగుతుంది.
- ఆరంభంలో నాలుగు వారాలు, ఆ తర్వాత 6 నెలల పాటు ఇటువంటి ప్రయత్నం చేసి నెమ్మదిగా ఈ దురలవాటు నుంచి శాశ్వత విముక్తి పొందవచ్చు.
- ఆధ్యాత్మిక జీవనాన్ని అలవాటు చేసుకోవడం ద్వారా కూడా ధూమపానానికి దూరం కావచ్చు.
- మనశ్శాంతితో పాటు మనోబలం, సహనశక్తి, వృద్ధి అవుతాయని, తద్వారా వ్యసనాలపై అసహ్యం కలుగుతుందనేది మెడిటేషన్ కేంద్రాల వారి సూచన.
- పొగాకు సేవించడం వదిలేసిన 12 గంటల్లోనే మీకు చక్కని అనుభూతి కలుగుతుంది. లోతైన శ్వాస మీ సొంతమవుతుంది. రెండు రోజుల తర్వాత భోజనం ఎంతో రుచిగా అనిపిస్తుందని చెబుతున్నారు వైద్య నిపుణులు.
- ప్రతిరోజూ వ్యాయామం, ఆటలాడడం వంటి వాటికి సమయం ఇవ్వాలి. ఫలితంగా మస్తిష్కం పనితీరు పెరుగుతుంది. దీని వల్ల సిగరెట్ తాగాలనే కోరిక కలగదని చెబుతున్నారు నిపుణులు.



దృఢ సంకల్పంతో..

పొగతాగడం వల్ల కొత్త జబ్బులు వస్తున్నాయి. శారీరక రోగాలు, కుటుంబ సమస్యలు, ఆర్థిక సమస్యల వల్లనే చాలా మంది పొగాకుకు బానిసలవుతున్నారు. పొగాకు సేవించడం వల్ల భవిష్యత్‌లో మంచాన పడతారు. ఎన్ని విధాలుగా ప్రయత్నించినా, ఎన్ని మందులు, ఎంత మంది డాక్టర్ల సలహాలు తీసుకున్నా మార్పు రాని ఈ వ్యసనాలను దృఢ సంకల్పం అనే మందుతోనే మానడం సాధ్యమవుతుంది.

– డాక్టర్ సత్యశ్రీ, చెస్ట్ ఫిజీషియన్

సహజ రాజయోగతో విముక్తి

సహజ రాజయోగ ద్వారా వ్యసనాలకు శాశ్వత విముక్తి కలుగుతుంది. 300 ఏళ్లుగా పరిచయమైన పొగాకు, మత్తుపానీయాలు నేటి మానవ సమాజ నైతిక పతనానికి మూల కారణాలు. ప్రపంచ వాతావరణ పరిస్థితులు, మానవ సమాజ స్థితిగతులు పరిశీలించినట్లయితే వ్యసనాలు, మత్తువ దార్థాలను తక్షణమే వదిలిస్తేనే మానవజాతిని పర్యావరణ కాలుష్యం నుంచి రక్షించుకోగలుగుతాం.

– బీకే రమా, ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయ ప్రతినిధి

పొగాకు ఉత్పత్తుల వాడకంతో అనర్థాలు

ఆరిలోవ : పొగాకు ఉత్పత్తుల వాడడడం వల్ల పలు అనర్థాలు ఏర్పడుతాయని, దీనిపై ప్రభుత్వాలు కఠినమైన చర్యలు చేపట్టాలని మహాత్మా గాంధీ క్యాన్సర్ ఆస్పత్రి రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ మేనేజింగ్ డైరెక్టర్ వూన్న మురళీకృష్ణ కోరారు. ప్రపంచ పొగాకు నివారణ దినోత్సవం సందర్భంగా గురువారం ఆయన పొగ తాగడం వల్ల కలిగే అనర్థాల గురించి వివరించారు. పొగాకు వాడకం వల్ల దేశంలో ఏటా 1.3 మిలియన్ల మంది మరణిస్తున్నారన్నారు. ఇది శరీరంలో అన్ని అవయవాల జీవ ప్రక్రియను ప్రభావితం చేస్తుందన్నారు. క్యాన్సర్, ఉదర, హృదయం జీవ ప్రక్రియల రుగ్మతులు రావడంతో పాటు అంగవైకల్యానికి కారణమవుతుందన్నారు. పొగ తాగినవారితో పొగను పీల్చుతున్న వారు సైతం క్యాన్సర్‌కు గురవుతున్నారన్నారు. పొగాకును ఆకర్షించడానికి వాటి పరిశ్రమలు 15,000 కొత్త రుచులను సమాజంలో అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. భారత ప్రభుత్వం జాతీయ పొగాకు నియంత్రణ కార్యక్రమం ద్వారా సమాజంలో పొగాకు ప్రభావం తగ్గించడానికి ప్రభుత్వం చాలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

సందడిగా సాగరతీరం

బీచ్‌రోడ్డు: ఎండల తీవ్రత, ఉక్కపోత నుంచి ఉపశమనం కోసం నగర ప్రజలు గురువారం సాగరతీరానికి చేరుకోవడంతో సందడిగా మారింది. చిన్నారులు, యువత చల్లని గాలులను ఆస్వాదిస్తూ.. స్నానాలు చేస్తూ ఎంజాయ్ చేశారు.



వంశీకృష్ణ పగటి కలలు మానుకో..

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షులు కోలా గురువులు


కొమ్మాది: విశాఖ దక్షిణ నియోజకవర్గంలో గెలుస్తానని వంశీకృష్ణ శ్రీనివాస్ పగటి కలలు కంటున్నాడని, అది మానుకుంటే మంచిదని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు అన్నారు. ఎండాడలోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాజకీయ భవిష్యత్‌నిచ్చిన వైఎస్సార్ సీపీని వీడి వంశీకృష్ణ చాలా తప్పు చేశాడని, ఆయనకు భవిష్యత్‌లో ఎమ్మెల్యే అయ్యే యోగ్యత లేదన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దయతో అనేక పదవులు అనుభవించి, నేడు వైఎస్సార్ సీపీ గురించి ఇష్టమొచ్చినట్లు మాట్లాడటం సరైంది కాదన్నారు. ఇప్పటికైనా వంశీకృష్ణ నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని, లేకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. పిఠాపురంలో పవన్ కల్యాణ్ పరిస్థితే అయోమయంగా ఉందన్నారు. జూన్ 4న వెలువడే ఫలితాల్లో వైఎస్సార్ సీపీ జెండా ఎగరడం ఖాయమని, ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశాఖలో ప్రమాణ స్వీకారం చేయడం తథ్యమన్నారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాలతో పాటు విశాఖ ఎంపీ స్థానాన్ని కూడా వైఎస్సార్ సీపీ దక్కించుకుంటుందన్నారు. సమావేశంలో వివిధ విభాగాల అధ్యక్షులు వంకాయల మారుతీ ప్రసాద్, బోని శివరామకృష్ణ, అప్పన్న పాల్గొన్నారు.

ప్రశాంతంగా టెన్త్ పరీక్షలు

విశాఖ విద్య: పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నట్లు డీఈవో ఎల్.చంద్రకళ ఓ ప్రకటనలో తెలిపారు. గురువారం జరిగిన సైన్స్ పరీక్షకు జిల్లాలోని 20 కేంద్రాల్లో 2,487 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. పరీక్షకు నమోదు చేసుకున్న వారిలో 1,004 మంది హాజరుకాలేదన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా స్క్వాడ్ బృందాలు తనిఖీ చేసినట్లు పేర్కొన్నారు.

యూత్‌ను ఆకట్టుకున్న డర్టీఫెలో

చిత్ర హీరో శాంతిచంద్ర



సీఎంఆర్ సెంట్రల్‌లో హీరో శాంతిచంద్ర, హీరోయిన్లు నత్రిత, దీపికాసింగ్

మద్దిలపాలెం : మాఫియా మెడలు వంచే కథాంశంతో జి. భద్రకాళి సమర్పణలో రాజ్ ఇండియా ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై దర్శకుడు ఆదారి మూర్తి తెరెక్కించిన డర్టీఫెలో చిత్రాన్ని యువత విశేషంగా ఆదరిస్తున్నారని చిత్ర హీరో శాంతిచంద్ర అన్నారు. మద్దిలపాలెం సీఎంఆర్ సెంట్రల్‌లో ఐనాక్స్ థియేటర్‌లో గురువారం చిత్ర యూనిట్ సందడి చేసింది. ఈ సందర్భంగా శాంతిచంద్ర మాట్లాడుతూ ఈనెల 24న చిత్రం విడుదలైందన్నారు. రోజురోజుకూ ప్రేక్షాదరణతో దూసుకుపోతోందన్నారు. విశాఖ అందాల నడుమ ఈచిత్రాన్ని తెరెక్కించామని చెప్పారు. యాక్షన్, రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా రూపుదిద్దుకుందన్నారు. దర్శకుడు మూర్తి మాట్లాడుతూ చిత్రాన్ని ఆదరించిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. హీరోయిన్ నత్రిత, దీపికాసింగ్ పాల్గొన్నారు.

బీచ్‌రోడ్డులో కారు బీభత్సం

ఆరిలోవ: బీచ్‌రోడ్డులో ఓ కారు బీభత్సం సృష్టించింది. మద్యం మత్తులో ఆ కారు నడుపుతున్న వ్యక్తి రాంగ్ రూటులో వెళ్లి ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టాడు. ఆరిలోవ ట్రాఫిక్ సీఐ ప్రసాదరావు తెలిపిన వివరాలివీ.. బిగ్ బాస్కెట్‌లో పని చేస్తున్న ఓ వ్యక్తి ద్విచక్ర వాహనంపై సాగర్‌నగర్ నుంచి జోడుగుళ్లపాలెం వైపు వస్తున్నాడు. అనంతపురానికి చెందిన ఎర్రగుంట్ల క్రాంతికుమార్ రుషికొండ నుంచి కారు నడుపుకుంటూ నగరం వైపు వెళుతున్నాడు. సీతకొండ సమీపంలో పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేస్తున్న విషయాన్ని గమనించిన క్రాంతికుమార్ తన కారును వెళ్లిన లైన్‌లోనే టర్న్ చేసి రాంగ్ రూటులో మళ్లీ రుషికొండ వైపు తిప్పాడు. ఈ క్రమంలో ఎదురుగా ద్విచక్ర వాహనంపై వస్తున్న బిగ్ బాస్కెట్ బాయ్‌ను ఢీకొట్టాడు. ఈ ఘటనలో అతను కింద పడి తలకు తీవ్ర గాయమైంది. అతని బైక్‌ను మాత్రం కాంతికుమార్ సుమారు అర కిలోమీటర్‌పైగా సాగర్‌నగర్ కాలనీ మీదుగా తాటిచెట్లపాలెం వరకు ఈడ్చుకుంటూ వెళ్లాడు. కొందరు వాహన చోదకులు ఆ కారును వెంబడించి తాటిచెట్లపాలెం వద్ద అడ్డుకుని పోలీసులకు అప్పగించారు. తలకు తీవ్రగాయాలైన బిగ్ బాస్కెట్ బాయ్‌ను చికిత్స కోసం కేజీహెచ్‌కు తరలించారు. కారు నడిపి ప్రమాదానికి కారణమైన క్రాంతికుమార్‌ను అదుపులోకి తీసుకున్నట్లు సీఐ తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.

భర్తను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న మాజీ మిస్ వైజాగ్

- విడాకులు ఇవ్వకుండా వేరే అమ్మాయిని పెళ్లి చేసుకున్నాడని ఆరోపణ
- మూడో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు



నక్షత్ర, తేజల వివాహం నాటి ఫొటో

బీచ్‌రోడ్డు : వేరే అమ్మాయితో వివాహేతర సంబంధం పెట్టుకున్న తన భర్తను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుంది మాజీ మిస్ వైజాగ్ నక్షత్ర. తనకు విడాకులు ఇవ్వకుండా వేరే అమ్మాయిని పెళ్లి చేసుకొని కాపురం చేస్తున్నాడని ఆరోపిస్తూ గురువారం మూడో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఆమె ఫిర్యాదు చేసింది. 2011 మిస్ వైజాగ్ విజేత అయిన నక్షత్ర 2013లో ఓ సినిమా షూటింగ్ సమయంలో తేజతో పరిచయం ఏర్పడింది. అప్పటి నుంచి వారి మధ్య స్నేహం పెరిగింది. 2017లో ఇద్దరు ప్రేమ వివాహం చేసుకున్నారు. వారికి ఒక పాప కూడా పుట్టింది. అయితే కొన్ని నెలల తరువాత తేజ ఇతర అమ్మాయిలతో వివాహేతర సంబంధాలు కలిగి ఉన్నట్లు గుర్తించిన నక్షత్ర అతడిని నిలదీసింది. దీంతో ఆమెను వేధింపులకు గురిచేశాడు. ఆమె 2020లో పోలీసులకు ఫిర్యాదు చేయటంతో అతనిపై కేసు నమోదైంది. ఈక్రమంలో తేజ తనుచేస్తున్న నేవీ ఉద్యోగాన్ని కూడా కోల్పోయాడు. దీంతో ఫుల్ టైం సినిమా అవకాశాల కోసం ప్రయత్నిస్తున్నాడు. ఈ క్రమంలో మరింత మంది అమ్మాయిలతో వివాహేతర సంబంధాలను పెట్టుకున్నాడు. గురువారం ఒక అమ్మాయితో దసపల్లా హిల్స్‌లోని ఒక అపార్ట్‌మెంట్‌లో ఉండగా నక్షత్ర వారిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకొని మూడో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇదిలా ఉంటే నక్షత్రనే తనపై తన కుటుంబ సభ్యులపై అక్రమ కేసులు బనాయించిందని తేజ చెబుతున్నాడు. ఆఫీసులో ఓ సినిమా విషయమై ఒక అమ్మాయితో చర్చలు జరుపుతున్న సమయంలో నక్షత్ర వచ్చి దాడి చేసిందని ఆరోపించాడు. అది ఇల్లు కాదని, ఆఫీసు అని చెప్పుకొచ్చాడు.

మూడో అంతస్తుపై నుంచి పడి ఒకరి మృతి



నీలాపు శ్రీనివాస రెడ్డి (ఫైల్)

తగరపువలస: భీమిలి మండలం రేఖవానిపాలెం పంచాయతీ మరడపాలెం గ్రామానికి చెందిన నీలాపు శ్రీనివాసరెడ్డి మూడో అంతస్తు పై నుంచి పడి మృతి చెందాడు. ఆయన నివాసం ఉంటున్న తగరపువలస శ్రీబాసర లే అవుట్‌లోని ఎస్ఆర్ హైట్స్‌లో బుధవారం రాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. బుధవారం సాయంత్రం శ్రీనివాసరెడ్డి తన భార్య, పిల్లలు చరణ్, శరణ్యతో కలిసి చిప్పాడ పండగకు వెళ్లారు. రాత్రి 9.30 సమయంలో శ్రీనివాసరెడ్డి అక్కడ వేడికి తాళలేక భార్య రాజేశ్వరికి చెప్పి ఒక్కడే ఎస్ఆర్ హైట్స్‌లోని తన ఇంటికి వచ్చాడు. రాత్రి 12.30 సమయంలో శ్రీనివాసరెడ్డి మూడో అంతస్తు పై నుంచి ప్రహరీపై పడిన పెద్ద శబ్దం వినిపించింది. సెల్లార్‌లో నిద్రిస్తున్న వాచ్‌మన్ వై.సూరిబాబు వెళ్లి చూడగా శ్రీనివాసరెడ్డి తీవ్రగాయాల పాలై అపస్మారకస్థితిలో పడి ఉన్నాడు. వెంటనే వాచ్‌మన్ అతని భార్యకు ఫోన్ చేసి జరిగిన విషయం తెలియజేశాడు. దీంతో ఆమెతో పాటు వారి బంధువులు అక్కడకు చేరుకున్నారు. ఈ లోగా 108కు సమాచారం అందించడంతో వారు వచ్చి చూసి శ్రీనివాసరెడ్డి మృతి చెందినట్లు నిర్ధారించారు. రాజేశ్వరి పోలీసులకు ఇచ్చిన సమాచారం ప్రకారం మృతుడు ఇంటికి వచ్చి స్నానం చేసిన తర్వాత చల్లగాలికి బాల్కనీకి వెళ్లాడు. అక్కడ అదుపుతప్పి కిందకు పడిపోయినట్లు భావిస్తున్నామన్నారు. శ్రీనివాసరెడ్డి కారు డ్రైవింగ్ స్కూల్ నిర్వహిస్తున్నాడు. భీమిలి ఎస్ఐ గంటా హరీష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జోరుగా చంద్రంపాలెం హైస్కూల్‌లో అడ్మిషన్లు




విద్యార్థుల పత్రాలు పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు

మధురవాడ: రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు పొందిన చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జోరుగా అడ్మిషన్లు జరుగుతున్నాయి. ఇప్పటివరకు 515 మంది ఆన్‌లైన్‌లో ఈ పాఠశాలను ఎంపిక చేసుకున్నారు. ఇందులో 150 మంది రిపోర్ట్ చేసి తగిన పత్రాలు అందించారు. ఈ ఏడాది నుంచి విద్యార్థి టీసీ తీసుకున్నప్పుడే తాను ఏ పాఠశాలలో చేరుతున్నాననే ఆప్షన్ ఎంచుకునే అవకాశం అందుబాటులోకి వచ్చింది. బదిలీ, ప్రవర్తన, విద్యా సంబంధింత ధ్రువపత్రాలతో పాటు ఇతర వివరాలన్నీ వారు ఎంపిక చేసుకున్న పాఠశాలకు చేరుతాయి. ఈ ధ్రువీకరణపత్రాలన్నీ ఎంచుకున్న పాఠశాలకు వెళ్లి సమర్పించాల్సి ఉంటుంది. అక్కడ హెచ్ఎం పరిశీలన అనంతరం అడ్మిషన్ లభిస్తుంది. ఈ విధంగా చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఇప్పటి వరకు 515 మంది ఆన్‌లైన్‌లో ఎంపిక చేసుకున్నారు. వీరిలో మధురవాడ పరిసర ప్రాంతాలకు చెందిన విద్యార్థులే కాకుండా.. చిత్తూరు, శ్రీకాకుళం, విజయనగరం తదితర జిల్లాలకు చెందిన ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు ఉండటం విశేషం. ఇప్పటి వరకు 150 మంది రిపోర్ట్ చేసి పత్రాలు సమర్పించినట్లు పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం ఎస్‌వీఎస్ సోమయాజులు తెలిపారు. 10వ తరగతి సప్లిమెంటరీ పరీక్షలు కారణంగా ఇప్పటివరకు మధ్యాహ్నం పూట మాత్రమే అడ్మిషన్లు నిర్వహిస్తున్నారు. సోమవారం నుంచి ఉదయం పూట కూడా అడ్మిషన్లు తీసుకుంటామని హెచ్ఎం వివరించారు.

అంతా చనిపోయాడనుకున్నారు.. కానీ..


కుటుంబ సభ్యుల చెంతకు తప్పిపోయిన వ్యక్తి



గోపాల్‌(నీలం రంగు టీ షర్టు)ను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న సూపరింటెండెంట్ రామిరెడ్డి, హెచ్‌వోడీ విజయలక్ష్మి, మమత

అల్లిపురం: మూడేళ్ల కిందట ఆస్పత్రికి వెళ్లిన వ్యక్తి తిరిగి రాలేదు. వెతికినా, పోలీసులకు ఫిర్యాదు చేసినా జాడ లేకపోవడంతో చనిపోయాడని అంతా భావించారు. అయితే ఇక్కడే ట్విస్ట్ నెలకొంది. చనిపోయాడనుకున్న వ్యక్తి కొన్నేళ్ల తర్వాత సజీవంగా ఇళ్ల ముందు కనిపించడంతో ఆ కుటుంబం ఆనంద డోలికల్లో మునిగిపోయింది. బుచ్చిరాజుపాలెం జీవీఎంసీ షెల్టర్ మేనేజర్ ఎల్లేటి మమత తెలిపిన వివరాలివీ.. ఈ నెల 2న సింధియాలో మతిస్థిమితం లేని వ్యక్తి తిరుగుతున్నట్లు వచ్చిన సమాచారంతో బుచ్చిరాజుపాలెం జీవీఎంసీ షెల్టర్ సిబ్బంది అక్కడకు వెళ్లారు. ఆయన్ని చినవాల్తేరు మానసిక చికిత్సాలయంలో చేర్పించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ రామిరెడ్డి సహకారంతో మెరుగైన చికిత్స అందజేయడంతో అతని ఆరోగ్యం మెరుగుపడింది. దీంతో తన వివరాలు తెలపగలిగాడు. తన పేరు గోపాల్ చంద్ర మైతీ అని, తనది పశ్చిమ బెంగాల్‌లోని ముక్సద్‌పూర్ అని చెప్పడంతో అక్కడి పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందజేశారు. ఆ పోలీస్ స్టేషన్‌లో మూడేళ్ల కిందటే అతను తప్పిపోయినట్లు కేసు నమోదు కావడంతో.. పోలీసులు గోపాల్ కుటుంబ సభ్యులకు ఈ సమాచారం తెలిపారు. దీంతో అతని అన్నయ్య సుబ్రత మైతీ, చిన్నాన్న దేబ్ దులాల్ మైతీ గురువారం నగరానికి చేరుకున్నారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామిరెడ్డి, హెచ్‌వోడీ విజయలక్ష్మి, జీవీఎంసీ షెల్టర్ మేనేజర్ ఎల్లేటి మమతలు గోపాల్ మైతీని అతని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

కేజీహెచ్ ఆర్ఎంవోగా శంకర రావు బాధ్యతల స్వీకరణ



అల్లిపురం: కేజీహెచ్ డిప్యూటీ సివిల్ సర్జన్ ఆర్ఎంవోగా డాక్టర్ శంకరరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆయన జీవీఎంసీ, డీఎంహెచ్‌ఓ కార్యాలయాల్లో పనిచేశారు. కాగా జూన్ నెలాఖరుకు ఆయన రిటైర్ కానున్నారు.

విజయలక్ష్మికి వైద్య పరీక్షలు

కేజీహెచ్ సూపరింటెండెంట్ ఆశోక్‌కుమార్‌పై లైంగిక వేధింపులు ఆరోపణలు చేసిన గ్రేడ్-1 నర్సింగ్ సూపరింటెండెంట్ విజయలక్ష్మికి గురువారం కేజీహెచ్ గైనిక్ వార్డులో వైద్య పరీక్షలు నిర్వహించారు.